

# హాలి సోరాజ్

"ఓకే.... ఓకే.... పాపం శమించు గాక!"

చిరంజీవి మెల్లగా చెంపలు వేసుకున్నాడు.

అందరూ పకపకా నవ్వుకున్నారు.

కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

మళ్ళీ చిరంజీవి జోకు వేశాడు.

"మనదేశం ఎవ్వటికీ అభివృద్ధి చెందదు."

"ఎందుకని?"

"వెరీ సింపుల్.... విదేశాల్లో తాగటానికి ఉన్నోడు, లేనోడు, పెద్దాడు, చిన్నాడు అనే డిఫరెన్స్ ఉండదు! ఆడాళ్లు మగాళ్లు భుజాలమీద చేతులు వేసుకొని మరీ తాగుతారు. అందుకే ఆ దేశాలు పై పైకి పోతుంటే, తాగడం తప్పనుకుంటున్న మన దేశం కిందికి దిగజారిపోతుంది."

"ఇదిమాత్రం నిజం...వెల్ సెడ్..."

"థాంక్యూ... థాంక్యూ ఫ్రెండ్స్..."

చిరంజీవి చిన్నగా తలని గాలిలో ఆడిస్తూ, అందరి ముందుకూ మందు గ్లాసులు తోశాడు.

రిచర్డు అటన్‌బరో సృష్టించిన మహా కావ్యం 'గాంధీ' సినిమా చూసేక ఆ మిత్రబృందానికి బ్రాందీకొట్టాలని పించింది.

అదేవిటని ఆశ్చర్యపోకండి.

'బరువెక్కిన మనసుని తేలికపరచాలంటే 'మందు' పోసుకోవల్సిందే!' ముచ్చటైన ముక్తాయింపు వాళ్ళది.

"డియర్ ఫ్రెండ్స్! జీవితంలో గాంధీగారు గొప్ప అనుభూతిని పోగొట్టుకున్నారు."

"ఏవిటది?"

"మందు అనుభూతి."

"తప్పు గురూ! అహింసా సిద్ధాంతాన్ని అమలుజరిపిన బాపూని బార్లోకి లాక్కొస్తే నీ కళ్లు పోతాయి"




"ఛీర్స్.... ఛీర్స్.... ఛీర్స్.... ఛీర్స్...."

ఛీర్స్ కొట్టక సిప్ చెయ్యకుండా గ్లాసు కింద పెట్టకూడదనే టేబుల్ మేనర్సుని వాళ్లు బాగా అధ్యయనం చేశారు.

అదొక రంగుల ప్రపంచం.

కష్టాలు, కన్నీళ్లు, బరువులు, బాధ్యతలు– ఎవరి కళ్ళలో కనిపించవు. తాగు, తిను, పాడు, ఆడు– ఆ నాలుగు సూత్రాల మీద అక్కడ వాతావరణం కళకళలాడుతుంది.

చిరంజీవి ఉన్నచోట కూడా కళకళలాడుతుంది.

అతను వేసే జోకులకు, విసిరే ఛలోక్తులకు నాయుడు, రత్నం, సుభాన్ పడి పడి నవ్వుతారు. అతనంటే పడి చస్తారు కూడా.

ప్రతిపక్షం లేని అధికారపార్టీ లాంటిది వాళ్ల స్నేహం. యూనివర్సిటీలో ఎమ్మే ప్రీవియస్ చదువుతున్న ఆ నలుగురూ పేకముక్కల్లో కళావరు, ఆటీన్, ఇస్పేటు, డైమండ్ లాంటివాళ్లు, హాస్టల్లో ఉంటున్నారు. కలిసి సరదాలు, షికార్లూ, టూర్లూ వేస్తుంటారు.

'చిరంజీవి బంగారు పిచ్చుక'

ఇది అతని మిత్రుల అభిప్రాయం. అభిప్రాయమే కాదు వాస్తవం కూడా. మొదటిరోజున కాలేజీలో ఒకర్నొకరు పరిచయం చేసుకున్నప్పుడు చిరంజీవి తన గురించి, తన స్టేటస్ గురించి, తన బ్యాక్‌గ్రౌండ్ గురించి, తన ఫ్యామిలీ పొజిషన్ గురించి చాలా వివరంగా సగర్వంగా చెప్పుకున్నాడు. అతను ఏమిటో తెలుసుకున్న తర్వాత తమ గురించి పరిచయం చేసుకోవడమే మరచిపోయారు మిగిలిన ముగ్గురూ.

ఆ బంగారు పిచుకతో కలిసి తిరగాలని, మజాలు చేయాలనీ నాయుడు, రత్నం, సుభాన్ ఎవరికివారే ఆశపడుతూ ఉంటారు.

అతని మాటల్లో చిరంజీవి పరిచయం ఇది:

చిరంజీ బోర్న్ విత్ సిల్వర్ స్పూన్, కష్టాలు కన్నీళ్లూ బొత్తిగా తెలియవు ఇబ్బందులు విపత్తులూ ఎలా ఉంటాయో చూల్లేదు. అతని తాతగారు ఊరి మునసబు. వాళ్ల నాన్నగారు పెద్ద కాంట్రాక్టరు. పొలం పుట్రా పుష్కలంగా ఉన్నాయి. పెద్ద బంగళా చిన్నకారూ ఉన్నవట. నౌకర్లు చాకర్లు పిలిస్తే పలుకుతారు. వాళ్లకి ఉన్నది ఒక్కడే.... వాళ్లకి ఉన్నది ఆ ఒక్కడిదే. వాట్‌నాట్ అన్నీ వున్నవి కనుక బంగారు పిచ్చుకయ్యాడు.

రెండు మూడు రోజుల తేడాతో నెల మొదటి వారంలోనే అందరికీ వాళ్ల వాళ్ల ఇళ్లనుండి డబ్బు అందుతుంది. సుభాన్ సిటీ బస్సుల్లో టిక్కెట్లు మాత్రం తానే తీస్తానంటాడు. కాఫీలు టిఫిన్లు వగయిరాలు తనకి విడిచిపెట్టమంటాడు రత్నం. సినిమాలాంటి చిన్న ఖర్చులు తన వాటాగా నాయుడు పెట్టుకుంటాడు. షి–బార్లూ లాంటి పెద్ద బిల్లులు 'పే' చేయగల స్తోమత ఎవరికీ లేదు. గనక– వాటిని తానే భరిస్తానంటాడు, చిరంజీవి.

మనసు బరువెక్కినా, ఆకాశం మబ్బుపట్టినా, ఆడపిల్ల నవ్వినా, అపూర్వమైన అనుభవం ఏదైనా జరిగినా– ఆ రోజు ఆ సందర్భాన్ని పురస్కరించుకొని మందుపార్టీ జరుపుకోవల్సిందే!

ఒకవేళ చిరంజీవి వీలుపడక, ఏవో కారణాలు చెప్పి దాటెయ్యాలనుకుంటే– అతని మిత్రబృందం 'స్టేటస్, బాక్‌గ్రౌండ్, పొజిషన్' అనే చరణాలతో కోరస్ పాడతారు.

నెలకి మూడు బార్లూ ఆరు పార్టీలుగా వాళ్ల స్నేహం సాగిపోతుంది.

రెండు రౌండ్లు పూర్తయ్యాయి.

మూడో రౌండుకి ఆర్డరు చేశాడు, చిరంజీవి.

పొగడ్తలు!

అవంటే చిరంజీవికి చాలా యిష్టం.

తన గురించి అతనికి బాగా తెలుసు. తనకి కొన్ని బలహీనతలున్నాయి. వాటిని బయటపెట్టి, తన అసహాయతను కన బరచలేడు.

నాయుడు, రత్నం, సుభాన్— పంట లేసుకొని, వంతులుగా, పోటీపడి చిరంజీవిని మెట్టుమెట్టుగా ఎక్కించి, కాసే పట్లో గాలిలో నిలబెట్టేరు.

చిరంజీవి లాంటివాడు యూనివర్సిటీల్లోకూడా కనిపించడం అరుదన్నారు. అతను కాలేజీ జి.సి. గానే కాదు దేశానికి పి.యం.గా కూడా పనికొస్తాడన్నారు. క్లాసులో నీరజ నీలికళ్ళలోనే కాదు స్వర్గంలో ఊర్వశి గుండెల్లోకూడా చోటు చేసుకోగల నేర్పు అతనికుందన్నారు.

అబద్ధం ఎంతో అందమైంది.

* * *

'టెలిగ్రాం సార్!'

టెలిగ్రాఫ్ మెసెంజరు యిచ్చిన టెలిగ్రాం చూసి, చిరంజీవి క్షణంసేపు గాభరాపడ్డాడు.

వారం రోజుల క్రిందట తన తండ్రి ఒంట్లో బావుండలేదని, అప్పుడప్పుడు రక్తం కక్కుకుంటున్నాడని ఉత్తరం వచ్చింది. పక్కింటి ఆచారి బాబాయి ప్రతి విషయాన్ని భూతద్దాల కింద ఉంచి ఫోటోస్టాట్ చేస్తాడని ఆ ఉత్తరాన్ని లెక్కచేయలేదు. అందుకే కాబోలు— వెంటనే రమ్మని బాబాయి టెలిగ్రాం యిచ్చాడనుకున్నాడు, చిరంజీవి.

ఒకసారి చూసొస్తే ఏం పోతుంది?

ఏదో ప్రేమలాంటిది తన్నుకొచ్చి కాదుగాని— తనని ఎవరైనా అనుకుంటారేమోననే ఆలోచన రాగానే ఊరు వెళ్లాలనిపించింది అతనికి.

చేతిలో బొత్తిగా డబ్బుల్లేవు.

వారంకింద అందుకున్న అయిదు వందలు మూడురోజుల్లో అయిపోయాయి.

ఏం చేయాలో తోచక, కాసేపు గదిలో పిచ్చిగా అటూ ఇటూ తిరిగాడు.

నాయుడు, రత్నం, సుభాన్ వచ్చారు.

చిరంజీవికి పోయిన ప్రాణం మళ్లీ వచ్చినట్లయింది.

వాళ్లకి టెలిగ్రాం చూపించాడు.

"కంగ్రాచ్యులేషన్స్ గురూ!"

"ఛ! ఎందుకు?"

"తొందరలో లక్షలున్న ఇనప్పెట్టి తాళాలు నీ చేతికి రాబోతున్నందుకు మిత్రమా!"

"అందుకని?..."

"ఎగిరి గంతెయ్యాలి .... కలవాళ్లకి కన్నీళ్లు ఉండకూడదు. సెంటిమెంట్స్ పాడూ అసలే పనికిరావు. నువు లైమ్ లైట్‌లోకి రావాలంటే మీ బాబు జీవిత రంగంనుండి తప్పుకుంటేగాని వీలుపడదు కదా? అలాంటి అదృష్టం నీకు తన్నుకొస్తుంది. అందుకే, కంగ్రాట్స్...."

వాళ్ల మాటలకి చిరంజీవి యిబ్బందిగా మొఖం పెట్టాడు.

"నువ్వు చాలా అదృష్టవంతుడివి గురూ! తొందరగా నీకు లైన్‌క్లియరన్సు దొరుకుతుంది."

"ఓ గాడ్! మే హిజ్ సోల్ యిన్ ది హెవెన్ అండ్ బ్లెస్ మై ఫ్రెండ్ విత్ గుడ్ ఫార్చ్యూన్."

"బ్రదర్ మమ్మల్ని మరిచిపోకేం?... నిన్ను నమ్ముకున్న వాళ్లం. నట్టేట్లో ముంచకు."

చిరంజీవికి ఒళ్లు కుతకుతలాడింది.

"షటప్.... ఒక్కమాట ఎక్కువగా వాగితే, మీతో ఫుట్‌బాల్ ఆడతాను."

తక్కిన ముగ్గురూ నోళ్ళు మూసుకున్నారు.

తర్వాత వాళ్లు సానుభూతి చూపిండమేగాక చిరంజీవితో ప్రయాణానికి సిద్ధపడ్డారు కూడా.

"సరే....అందరమూ కలసే వెళ్దాం, ట్రెయినూ బస్సూ నమ్ముకుంటే లాభం లేదు తొందరగా వెళ్లాలంటే టాక్సీ బుక్ చేయ్యాల్సిందే!"

"అవును....ఇక్కడ్నుంచే ఓ మంచి డాక్టర్ని కూడా మనతో తీసుకువెళ్లడం మంచిది."

"బ్రదర్! ఓ వంద ఇటు పడెయ్.... పళ్ళూగిళ్ళూ .... హార్లిక్స్.... గిర్లిక్సూ కుందులూగిందులూ ఇక్కడే కొందాం."

కాసేపు చిరంజీవి మాట్లాడలేక పోయాడు.

ఆ ముగ్గురూ తనతో ఊరికి వస్తే.... తనవాళ్ళను కలుసుకుంటే!.... తన స్థితి గతులు తెలుసుకుంటే! .... ఆ తర్వాత అతను ఊహించలేకపోయాడు.

వాళ్లనుండి తప్పించుకోవాలి!

నిశ్శబ్దం!

దాన్ని భంగపరుస్తూ, చిరంజీవి పకపకా నవ్వేడు.

'ఎందుకు నవ్వుతావ్!' అన్నట్లు ముగ్గురూ అతని మొఖంలోకి చూశారు.

"ఈ టెలిగ్రాం చూసి, మా బాబుకి సీరియస్ అని నమ్మేశారు కదూ! నో ఫోక్స్ .... నాకు తొందరగా పెళ్లి చేసెయ్యాలని మా తాతయ్య ఆలోచన. అందుకే, ఈ టెలిగ్రాం, మా డాడీ సీరియస్సునూ...."

అంతా తేలిగ్గా శ్వాస తీసుకున్నారు.

"ఒరేయ్, జీవీ! నువ్వు తొందరగా పెళ్లాడి మమ్మల్ని అన్యాయం చెయ్యకురోయ్...." అని సుభాన్ గెడ్డం పుచ్చుకొని బతిమాలేడు.

"మిత్రమా! పెళ్లంటే నూరేళ్ళపంట కాదు — నీ స్వేచ్ఛకి నూరేళ్ళు నిండిపోయాయన్నమాట....కోరి జీవితంలోకి సంకెళ్లు వేసుకోవద్దురా" నాయుడు జీవిత సత్యాన్ని వివరించి, సలహాయిచ్చాడు.

"గురూ! మనం కలిసి చదువుకుంటున్నాం. కలిసి షికార్లూ

చేస్తున్నాం.... కలిసి ఏమైనా సాధిద్దాం. కలసి చద్దాం. అంతేగాని అప్టరాల్ పెళ్లి కోసం మనం ఒకరికొకరం దూరం కావ డానికి వీల్లేదు. అంచేత_మనలో ఎవరూ పెళ్లి చేసుకోకూడదు. మనం 'పెళ్లి ని' వెలివెయ్యాలి. కాదూకూడదూ అని నువ్వు పెళ్లి చేసుకుంటే నేను ప్రాయోపవేశం చేస్తాను." రత్నం గట్టిగా హెచ్చరించాడు.

"అల్ రైట్ .... అల్ రైట్ .... మీ మాట అక్షరాల శిరసావహిస్తాను. ఓకే... సరేనా...." చిరంజీవి మాటయిచ్చాడు.

పొగ డ్తలు!

అవంటే చిరంజీవికి చాలా యిష్టం.

స్నేహితుల మాటల్లో, జోకుల్లో, నవ్వుల్లో తడిసి ముద్దయిన చిరంజీవి కాసేపు ఉక్కిరిబిక్కిరయ్యాడు.

"నేను ఊరువెళ్లటానికి అర్జంటుగా ఓ యాభై కావాలి. మీలో ఎవరైనా సర్దం డిరా ...." మిత్రుల మూడ్ చూసి అడిగాడు, చిరంజీవి.

"సారీరా! నా దగ్గిర మిగిలిన అయిదు రూపాయలు ఉదయం హోటల్లో అయి పోయాయి" రత్నం తెలివిగా సమాధానం యిచ్చి తప్పుకున్నాడు.

"నేనూ అప్పుకోసమే తిరుగు తున్నాను, గురూ! ఈ నెల మా బాబు ఒక్క పైసా పంపించలేదు" నాయుడు గబగబా చెప్పి, జారుకున్నాడు.

సుభాన్ చిన్న నవ్వు విసిరాడు.

"నా దగ్గరుండవని నీకు తెలుసు.... ఓ చిన్న సలహామాత్రం యివ్వగలను."

ఏమిటన్నట్లు చిరంజీవి చూశాడు.

"నీ బుక్స్ సెకండ్ హేండ్ మార్కె ట్టులో అమ్మి డబ్బులు తీసుకురాగలను."

చిరంజీవి బరువుగా నిట్టూర్చాడు.

* * *

చిరంజీవి రైలు దిగేసరికి మిట్ట మధ్యాహ్నం అయింది.

పొలాలు గట్లు దాటి మైలు దూరం నడిస్తే ఊరు కనిపిస్తుంది.

సన్నని కాలిబాటమీద అతను నడుస్తు న్నాడు.

గట్లకి కొంచెం దూరంలో ఇటుకల బట్టీ ఉంది. మట్టి పిసికి, ముద్దలు చేసి, అచ్చులు తీసి, ఎండలో వరసలుగా పేరుస్తున్నారు కూలీలు కొందరు. ఎండిన ఇటుకల్ని బట్టీలో ఉంచి మంట పెడుతు న్నారు మరి కొందరు.

సన్నని పొగలు, వరసలుగా పేర్చిన ఇటుకలు, పచ్చివాసన వేస్తున్న మట్టి, వివిధ భంగిమల్లో గమేళాలతో మట్టి ముద్దలతో కనిపిస్తున్న ఆడా మగా కూలీలు, వాళ్లను అంటిపెట్టుకు తిరుగు తున్న పిల్లలు_చాలా అందమైన దృశ్యం అతనికి కనిపిస్తుంది.

'తాజమహలు నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలు వీళ్లు' అనుకున్నాడు మనసులో.

"ఎంతసేపురా ముసిలి నాకొడకా, మట్టి పిసకతావు...బేగి పనిసెయ్యరా..." అక్కడ కూలీలచేత పనిచేయిస్తున్న మేస్త్రీ ఒక ముసిలాడ్ని డొక్కమీద తన్నేడు.

మట్టిలో రెండు చేతులు పెట్టి పిసుకు తున్న ఆ ముసిలాడు పక్కకి ఒరిగి పోయాడు. ఖంగుఖంగున దగ్గేడు. కాసేపు లుంగలు చుట్టుకుపోయి, రక్తం కక్కుకున్నాడు.

ముసిలాడు మళ్లీ ఓపిక తెచ్చుకుని మట్టి పిసుకుతున్నాడు. ఆ మట్టిలో ఎర్రని రక్తం కలిసిపోతుంది. కాస్త దగ్గరలో ఇటుకలు మోస్తున్న ఒక ఆడకూలీ గమ్మేళా వదిలి పరుగుపరుగున అతని దగ్గరకి వచ్చింది. ముసిలాడు ఛాతీమీద రుద్దుతుంది. ఆమె వెనుక నలుగురు చిన్న పిల్లలు చేతుల్లో మట్టిముద్దలు వదిలి, ఏడుస్తున్నారు.

చిరంజీవి నిశ్చేష్టుడైపోయాడు.

ఇప్పుడు తను సజీవమైన హృదయ విదారకమైన దృశ్యం చూస్తున్నాడు. ఆ దృశ్యంలో తన తండ్రి, తన తల్లి, తన తర్వాత పిల్లలు కనిపిస్తున్నారు. వాస్తవం ఎదురుగా నిలబడింది.

పొగడ్తలు!

అవంటే చిరంజీవికి చాలా యిష్టం.

అందుకే, తన చుట్టూఉన్న వాస్తవం ఎవరికీ కనిపించకూడదని చాలా కట్టు దిట్టం చేసుకున్నాడు. ఎవరికన్న తను తక్కువ కాకూడదని ఓ కృత్రిమమైన వాతావరణాన్ని సృష్టించుకున్నాడు. అందులో- అబద్ధపు తాతగారు, కాంట్రాక్టరు తండ్రి, పెద్ద బంగళా, చిన్న కారూ, వాళ్లకి ఉన్నది ఒక్కడే... వాళ్లకి ఉన్నది ఆ ఒక్కడిదే- అంతా కల్పన. తనను తాను మభ్యపెట్టుకొని బతుకుతున్నాడు.

తనవాళ్లు సంపాదిస్తున్న కూలిని తన చేతిలో పోస్తున్నారు. భవిష్యత్తు నిర్మాణం కోసం తమ రక్తం, కష్టం, కన్నీళ్లూ ఎంతో నమ్మకంతో పంచి యిస్తున్నారు.

కానీ, వాళ్లకి తను ఎలాంటి కూలి యివ్వాలనుకుంటున్నాడు?

ఆ ప్రశ్నకి సమాధానం కోసం పిచ్చిగా తల పీక్కున్నాడు.

రెండు కన్నీటి బొట్లు కిందికి జారి, అతని మనసు మీద పరచుకున్న మంచు తెరని చించాయి.